# గౌతమీగాథలు

## ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి

# టీ బోటు

"బోటులో వచ్చాం. సాయంత్రం 6 గంటలకు మీరిద్దరూ పెద్దకాలవ వంతెన దగ్గరకు రావలసింది"— వెంకట్రావు.

అనే చీటీ క్లాసులో ఉండగా ఒక కుర్రాడు తెచ్చి ఇచ్చాడు. క్లాసులో కాళ్ళు నిలవడం లేదు. రామారావు ఎక్కడున్నాడో కబురందించాలి.

పరధ్యానంగా - క్లాసులో పిల్లలడిగిన ప్రశ్నకు - 'పెద్ద కాలవ' అని సమాధానం చెబితే గొల్లున నవ్వారు.

ఐదు అయింది. రామారావు కోసం వెతికాను. కనిపించలేదు. గంట కొట్టారు. బడి విడిచిపెట్టారు. గేటు దగ్గర రామారావు పి. యస్. తో మాట్లాడుతున్నాడు. పి. ఎస్. శుద్ధ ఖద్దరు మనిషి. ఎదుట ఒక్క మనిషి వున్నా మరిచిపోయి 'సోదర సోదరీమణులారా' అని ప్రారంభించగలడు.

మెల్లగా దగ్గరకుచేరి రామారావు చేతిలో చీటీ వుంచాను. చూశాడు 'ఓహో బాగుంది. పి. యస్. గారూ మనతో వస్తారు.' ఉపన్యాసం ఆపించి ఆయన్నుకూడా బోటు దగ్గిరికి పట్టుకుపోయాం. పురుషసూక్తంలో చెప్పినట్టు 'నాన్యః పన్థాం— అయనాయ విద్యతే' -అది ఒక్కటే శరణ్యం!

ముగ్గురం పెద్దకాలవదగ్గరకి వెళ్ళాం. ధవళేశ్వరం దగ్గర చీలిన గోదావరి కాలవ రామచంద్రపురం పక్కగా కాకినాడ వైపు వెడుతుంది. ఆ కాలవకు రామచంద్రపురం దగ్గర పెద్ద వంతెన.

సాయంత్రం ఆరు గంట లయింది.

వంతెన దగ్గర దిగువగా పెద్దపెద్ద సిరిసెపు చెట్లు. దాన్ని సంస్కృతంలోకి మారిస్తే శిరీషం కావచ్చు. కాని చుట్టుపక్కలవాళ్ళు వాటిని నిద్రగన్నేరు చెట్లు అంటారు. వాటి పువ్వులు సుకుమారమైన ఎరుపు. తెలుపు రంగులు కూడిఉంటాయి. కేసరాలు ముట్టుకుంటే రాలిపోతాయి. అవంటే- కాళిదాసుకు ఎంత ఇష్టమో. 'శిరీష పుష్పాధిక సౌకుమార్యా' అని స్త్రీ లాలిత్యంతో పోలుస్తాడు.

ఆ చెట్ల నీడల్లో కాలవ చల్లగా సాగిపోతూ ఉంటే సాయంకాలాలు అక్కడ కూర్చుని, కాలవలో పడి తేలిపోయే సిరిసెపు పువ్వులు చూడడం కంటికి చెప్పరానంత సుఖం. ఎర్రని పెదవులమీద తెల్లని నవ్వులతో కన్నెపిల్లలు ఈదులాడుతూన్నట్టుంటుంది.

టీ బోటు ఆ నీడల్లో ఆగి ఉంది.

నాటుపడవలా కాకుండా తెల్లని రంగులతో స్వచ్ఛంగా, చూడముచ్చటగా వుంది ఆ పడవ. కాలవపక్క పల్లెటూరి పరిభాషలో దాన్ని 'దొరబోటు' అంటారు.

మమ్మల్ని చూడగానే వెంకట్రావు నవ్వుతూ పడవలోనుంచి బయటికివచ్చి ఆహ్వానించాడు.

వెంకట్రావు ఒక టీ కంపెనీకి 'రిప్రెజెంటేటివ్'గా పని చేస్తున్నాడు. అతని అల్లుడు అతనికి అసిస్టెంటు. అల్లుడు మాకు ఆతిథ్యం ఏర్పాటు చేస్తున్నాడు. వాళ్ళిద్దరినీ చూడగానే - నాకు సత్యనారాయణవ్రత కథలో అల్లుడు, మామలు జ్ఞాపకం వచ్చారు.

అల్లుడు మామలు వర్తక వ్యాపారాల్లో సంపాదించిన ధనమంతా అనేక వస్తురూపాల్లో వేసుకుని పడవలో వస్తున్నారు. ఒక పేద బ్రాహ్మడు వీరి పడవ దగ్గరకు వచ్చి ఏమైనా ధన సహాయం చెయ్యమని అడిగాడు. మామ పరమ లోభి. 'వెళ్ళవయ్యా. పడవలోదంతా డబ్బనుకున్నావా? ఆకూ, అలమూ' అన్నాట్ట. బ్రాహ్మడు నవ్వాడు- అంతే-బరువైన విలువైన వస్తువులతో కూడి నీటిలో సగం మునిగి ఉన్న పడవ తెప్పున తేలిపోయింది. పెద్ద వెర్రివాడు లబోదిబోమని కాళ్ళుపట్టుకుంటే బ్రాహ్మడు సత్యనారాయణ మూర్తిగా దర్శన మిచ్చి "అబద్ధాలు చెప్పకు. త్యాగం లేనిదే ధనం ఫలించదు" అని బుద్ధిచెప్పి వెళ్ళిపోయాడని

మా వెంకట్రావుకు ఆ భయం లేదు. సత్యనారాయణమూర్తే కాదు వైకుంఠంలోని- 'నగరి వారాబాల గోపాలమూనా వచ్చినా పడవలో ఉన్న దంతా ఆకూ అలమే' అని ఢంకా బజాయించి చెప్పగలడు. ఎంచేతంటే అందులో పేక్ చేసి ఉన్న దంతా ఒకటో రకమైన టీ లీఫ్ (తేయాకు అలమే ఉన్నది.) చక్కగా సత్యనారాయణమూర్తినీ పరివారాన్ని కూర్చోబెట్టి- పది కప్పుల శుభ్రమైన ఘుమఘుమలాడే టీ కలిపించి ఆతిథ్య మిచ్చి-'స్వామీ రెండు పాకెట్లు తమదగ్గర ఉంచండి' అని ఇచ్చి పంపేవాడు.

బాగా చల్లబడింది. సందె వెన్నెల వస్తోంది. అల్లుడు ట్రేలో నాలుగు కప్పులు మంచి టీ- రెండు బిస్కట్ పాకెట్లు, పంపాడు. తప్పకుండా అటువంటి అల్లుడు అందరికీ ఉండుగాక. అని మనసులో ఆశీర్వదించి టీ కప్పు లందుకున్నాం— మేలు జాతి బిస్కట్ల అనుపానంతో టీ సేవించాం.

సందె వెన్నెల చల్లగా సిరిసెపు చెట్ల ఆకులలోంచి మా మీద పడుతోంది.

ప్రియురాలి స్పర్శలా చల్లగాలి తిరిగింది. ఏమీ ఎరగని నాము ముద్దలాంటి వాడికే పాడుతూ గంతులు వేయాలనిపించే సమయం అది.

రసజత, సంస్కారం, కళాభిరుచీ కల వారి మాట చెప్పేదేమిటి?

వెంకట్రావు కాలకర్మవశాత్తు టీ యాజమాన్యం వహించాడుగాని సహజంగా మంచి భావుకుడు. కవితాభిమాని. పాటగాని, పద్యంగాని చక్కగా అనగలడు.

"ఎన్నెలంటే పాట కెంత మనసౌతాదో
పాట సాగేతలికి పయన మేమవుతాదో
ఆపలేనే యెంకి ఈ పడవ యిసురూ
పాడలేనే యెంకి పదము లీ రొదలో—"

అని సన్నగా అందుకున్నాడు.

ఆ సన్నని రాగానికి వెన్నెల కదుల్తోంది. గాలి ఊగుతోంది. రెండు మూడు సిరిసెపు పువ్వులు తలమీద పడ్డాయి.


కాలవవేపు చూస్తే 'యెలుతురంతా మేసి యేరు నెమరేసింది' అన్న మాటలు జ్ఞాపకం వచ్చి మనసు కలవళపడింది. ఉనికి మరిచిపోయి అలా కూర్చున్నాం కొంత సేపు.

వెంకట్రావు కదిలి అన్నాడు— భోజనాలు ఇక్కడే ఏర్పాటు చేశాను. చేసి వెడుదురుగాని- అని పట్టుబట్టాడు.

'ఏర్పాట్లన్నీ అయ్యాయి. రావచ్చు' అని పడవలో నుంచి పిలుపు.

పడవ మధ్య భాగంలో చక్కగా అరిటాకులు పరిచి ఒక స్వీటు, రెండు కూరలు వగైరా వడ్డనలు సిద్ధంగా ఉన్నాయి. కబుర్లు, నవ్వులు, పరాచికాలతో భోజనా

(56 వ పేజీ చూడండి)




## ఉదయశ్రీ

(ఖండ కవితా సంకలనం)

[రచయిత : కరుణశ్రీ. వెల : 40 రూపాయలు, ప్రచురణ : న్యూస్టూడెంట్ బుక్ సెంటర్, విజయవాడ - 2]

కమ్మనితావులు కుమ్మరిస్తూ కలకాలం నిలిచే కరుణశ్రీగారి ఖండికల- కలకండముల- రసగుళికల- రత్నాల పేటిక ఈ ఉదయశ్రీ. 5 భాగాలలో మొత్తం 160 ఖండికలున్నాయి.

ఇక వీటిలో వైవిధ్యం సంగతి చూస్తే "యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తిన తత్క్వచిత్" అన్నంతటి వైశాల్యం గోచరిస్తుంది. చూడగలిగిన కన్ను భావించగల అంతరంగం, అందించగల వాణి ఉండాలేకాని కవితా జగత్తులో చేరని, చేర్చుకోరాని వస్తువంటూ వుండదు గదా!

'పుష్పవిలాపం' వంటి భావనా ప్రధానములైన ఖండికలతో బాటు 'భుట్టో షష్టాష్టకము,' 'యాహ్యా సప్తకము' అనువాటినీ 'అనసూయా దేవి,' 'సతీ సావిత్రి' వంటి వానితో బాటు 'పాకీపిల్ల'నూ,- 'ధర్మ పరశు' వంటి ప్రాచీన గాథలతో బాటు 'స్వతంత్ర భారతి,' 'కాంగ్రెసు రథము' 'ఆగస్టు విప్లవము' వంటి ఆధునిక విషయాలను గ్రహించిన శ్రీ పాపయ్యశాస్త్రిగారి ఖండికలలోని వైవిధ్య విస్తారాలను గూర్చి వేరుగా చెప్ప నక్కర లేదుకదా!

ఎన్నో దృక్కోణాల నుండి చూడగా సాహిత్య క్షేత్రంలో బహుళార్థ సాధకమైన ఒక వారధిగా గోచరిస్తుంది ఈ ఉదయశ్రీ. కవితకూ, జీవితానికీ, భావనకూ, యథార్థానికీ, పండితులకూ, పామరులకూ, ప్రాచీనతకూ, నవీనతకూ, సంప్రదాయానికీ, ప్రయోగానికీ. భాషకూ–భావానికీ, భాషకూ–ఛందస్సుకూ— ఇట్లే ఇంకా ఎన్నింటి నడుమనో ఈ ఉదయశ్రీలోని ఖండికలు సమకూర్చిన సమన్వయము అనిదం పూర్వము, అనితర సాధ్యము.

కరుణశ్రీగారు చేసిన ఒక్కొక్క పద ప్రయోగంలో కవితా కలిక, ఒక్కొక్క రేకు విచ్చి, భావ వీచికా సౌరభమున పరిశ్రోతృజన మానసములకు ఒక అనిర్వచనీయమైన అనుభూతినీ, పారవశ్యాన్నీ కలిగిస్తుంది.

భాష, భావం చెట్టపట్టాలు పట్టుకుని సరా పరిపాఠకుని అంతరంగంలో ఒకే పరుగులు తీసే ధోరణిలోని వీరి వందల పద్యాలు ఎత్తి చూప వచ్చు. ఇట్టి కవితజ్ఞుల కవితామృతాన్ని గ్రోలి గర్రన త్రేన్చిన వారినే కావాలి 'అమృతస్య పుత్రాః' అన్నారు. కళ-అందులోనూ సాహిత్యం అసుందరమైనదాన్ని సుందరంగానూ, సుందరమైనదాన్ని అంతకంటె సుందరంగానూ చేస్తుందంటారు. అలాగే కరుణశ్రీగారి కవితాశ్రీ అయిన 'ఉదయశ్రీ' కూడా నీరస హృదయుని సరసహృదయునిగానూ, సరస హృదయుని అంతకంటె సరసునిగానూ చేయడంలో అద్వితీయమైనది అంటే అతిశయోక్తి కాదు, కానేరదు.

అలనాడు కన్నయ్య ఉదరశ్రీలోని పంచభూత నిర్మితాలైన పదునాల్గు లోకాల వైభవానికే మురిసిన యశోదకంటె ఈనాడు పాపయ 'ఉదయశ్రీ' లోని పంచభాగ ప్రపంచితములగు నూట అరువది కవితాజగత్తుల అందచందాలకు తెలుగుతల్లి ఎంత మురిసిపోతూందో!!! ఎప్పుడో కన్నయ్య తాను దొంగిలించిన వెన్న ముద్దలనూ, మిగడలనూ, పాలనూ మింగలేక కక్కలేక ఎన్ని యుగాలుగా కుత్తుకలో ఉంచుకో గలడు! పీకలమీది వ్యవహారంకదా! అందుకే కాబోలు ఈనాడు పాపయ గొంతు నుండి వానిని కవితల రూపంలో వెలువరిస్తున్నాడు! లేకపోతే పాపయశాస్త్రిగారి పద ప్రయోగంలో వెన్నలో మాత్రమే కనిపించే ఆ మెత్తదనం ఎలా ప్రవేశించింది? మీగడలో మాత్రమే అగుపడే సారగుణం వారి అర్థ ప్రయోగంలోకి ఎలా చొరబడింది? అలాగే క్షీరంలో మాత్రమే దాగిఉండే ఆ అమృతాస్వాదం వారి భావభంగిమం ఎలా అబ్బింది?

తనలో కవితాత్మ కొన ఊపిరితోనైనా బ్రదికి ఉందా! చచ్చిపోయిందా! అన్న సందేహం ఏ సహృదయునికైనా, ఎప్పుడైనా, ఏ కోశాన్నైనా కలిగితే విచికిత్సాలయాలకు గాని, చికిత్సాలయాలకు గాని పోక మన పాపయ్యశాస్త్రిగారి 'ఉదయశ్రీ' లోని ఒక్క పద్యం పఠించి చూస్తే చాలు. హృదయస్పందన, నిండు అనుభూతి కలిగి వెంటనే సందేహ డోలికలనుండి దిగి నిర్ధారణ పీఠికలపై కూర్చో వచ్చు.

సరస సాహితీ పిపాసువులకూ, సహృదయులకూ మరల మరల చదవక తప్పని ఖండ కవితా సంపుటి ఇది.

—ఆచార్య బయ్యా వెంకట సూర్యనారాయణ

★

## స్వీకారం

### కథా మాల

(కథల సంపుటి)

రచన : జి. వి. యల్. యన్. ప్రభాకర రావు; ప్రచురణ ; శ్రీ సూర్యా బుక్ పబ్లిషర్స్, రామచంద్రపురం వెల : మూడు రూపాయలు.

### భారతనారీ నీ మాంగల్యానికి మరో ముడి వెయ్యి

(నాటకం)

రచన : గొల్లపూడి మారుతీరావు; వెల : నాలుగు రూపాయలు: ప్రచురణ : అరుణా పబ్లిషింగ్ హౌస్; ఏలూరు రోడ్డు, విజయవాడ–2.

### అడుగు జాడలు

కుందుర్తి కృతులపై సమీక్షావ్యాస సంకలనం. సంపాదకుడు : పోరంకి దక్షిణామూర్తి; ప్రతులకు : శ్రీనివాస సాహితీ సమితి, 1-1-336/58. వివేకనగర్, హైదరాబాదు –500 020.

---

## గౌతమీ గాథలు

(4వ పేజీ తరువాయి)

లవుతున్నాయి. ఇద్దరు కుర్రాళ్ళు- మెరికల్లాటి వాళ్ళు తెల్లని-శుభ్రమైన దుస్తులతో వడ్డన సాగిసున్నారు.

ఒక కుర్రాడు నాదగ్గర మరి కాస్త స్వీటు వెయ్యబోయాడు! నేను నవ్వుతూ "లఘు, లఘు" అన్నాను. వెంకట్రావు పకాపకా నవ్వుతూ "శాస్త్రీ మా వాళ్ళకు సంస్కృతం రాదు. తెలుగులో చెప్పు" అన్నాడు. ఆలోచిస్తున్నాను.

వెంకట్రావు గంభీరంగా "వంట-ఎలా వుంది?"

"అద్భుతం" అన్నాను.

"రామాయణమంత బాగుందికదూ.... శ్రీ వాల్మీకి పాకం కనకనే అంత రుచి వచ్చింది" అన్నాడు.

"నేను సాభిప్రాయంగా నవ్వుతూ"—

—బ్రహ్మకృపా హి కేవలమ్ —

అని ముగించి లేచాను.

**Printed and Published by K. L. N. Prasad at Andhra Printers Ltd., Vijayawada-10**
**Editor : Puranam Subrahmanya Sarma.**